# వేళాపాళా లేని విద్యుత్ కోతలు

- మరమ్మతుల పేరుతో చీటికి మాటికి అంతరాయం
- విసుగెత్తిపోయిన జనం
- రోజులో 10 నుంచి 20 సార్లు పోయి వస్తున్న సరఫరా
- ముందస్తు చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలం
- ఇబ్బందులు పడుతున్న వినియోగదారులు



చేవెళ్ల 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్

చేవెళ్ల రూరల్, ఏప్రిల్ 28 : మండల పరిధిలోని గ్రామాల్లో వేసవిలో కరెంటు కష్టాలు కనిపిస్తున్నాయి. చాలా గ్రామాల్లో రోజుకు 10 నుంచి 20సార్లు కరెంటు పోయి.. రావడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఓ వైపు ఎండలు మండిపోతున్నాయి. మరో వైపు అప్రకటిత విద్యుత్ కోతలతో ఉక్కబోతతో ఇబ్బందులు పడుతున్నారు. పలు చోట్ల ముందుగానే ప్రకటించి కోతలు విధిస్తున్నారు. ఇదేమంటే మరమ్మతుల పేరు చెబుతున్నారు. రోజు రోజుకీ పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో కూలర్లు, ఫ్యాన్ల వినియోగం కూడా పెరిగింది. తద్వారా ఫీడర్లపై లోడు పెరగడంతోనే కరెంటు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని అనధికారికంగా సిబ్బంది పేర్కొంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా ప్రజలకు పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పించడంలో విఫలమైందని పలువురు వినియోగదారులు పేర్కొంటున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రెప్పపాటున కూడా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండేది కాదు. వర్షాకాలం, గాలిదుమారాలకు సైతం ముందస్తు ప్రణాళికలు ఉండేవి. ప్రస్తుతం అవేమి పట్టనట్లు అధికారులు, సిబ్బంది వ్యవహరిస్తున్నారు. చిన్నపాటి వర్షాలు, గాలి దుమారం ఏర్పడినప్పుడు మరమ్మతుల పేరుతో గంటల కొద్దీ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నది. చేవెళ్ల మండల పరిధిలోని గ్రామాలకు చేవెళ్ల 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రం, ఇబ్రహీంబాగ్ డివిజన్‌కు సంబంధించిన మెయిన్ లైన్ నుంచి విద్యుత్ సరఫరా అవుతుంది. చిన్నపాటి వర్షాలు.. గాలి దుమారాలకు సైతం తరచూ అంతరాయం ఏర్పడుతున్నది. కొన్ని సార్లు రాత్రులంతా నిద్ర లేకుండా గడుపుతున్నామని, అధికారులకు ముందస్తు ప్రణాళికలు లేకపోవడం, ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో సమస్య మరింత జఠిలం కావడానికి ప్రధాన కారణంగా తెలుస్తున్నది. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### రోజులో 10 నుంచి 20 సార్లు అంతరాయం



కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి అధికంగా విద్యుత్ కోతలు ఏర్పడుతున్నవి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రెప్పపాటు అంతరాయం ఏర్పడేది కాదు. అసలు ఈ ప్రభుత్వానికి ఏమైంది. రోజులో 10 నుంచి 20 సార్లు కరెంట్ పోతది.. వస్తది. ఇదేంటని అధికారులను అడిగితే పెద్ద లైన్ సమస్య ఉంది.. ఆ సమస్య ఉంది.. ఈ సమస్య ఉంది అని మేనేజ్ చేస్తున్నారు. చాలా ఇబ్బందులు పడుతున్నాం.

- కొల్లగల్ల భాస్కర్, ఈర్లపల్లి, చేవెళ్ల మండలం

### ఎప్పుడు పోతదో.. ఎప్పుడు వస్తదో..



రోజులో పూర్తిగా విద్యుత్ అంతరాయం లేని రోజు అంటూ లేదు. ఎప్పుడు పోతదో.. ఎప్పుడు వస్తదో తెలియదు. కరెంట్ లేకపోతే ఏ పని చేయలేని పరిస్థితి. ప్రభుత్వం మస్తు ఇబ్బంది పెడుతుంది. కేసీఆర్ హయాంలో ఇట్ల ఉండేది కాదు. మా ఖర్మ.. ఇక ఓట్లేసినం తప్పదు అనుకుంటున్నాం.

- కె.కరుణాకర్, ఈర్లపల్లి, చేవెళ్ల మండలం

## ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి



ఫిర్యాదు స్వీకరిస్తున్న ఆర్డీవో చంద్రకళ

చేవెళ్లటౌన్, ఏప్రిల్ 28 : ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో చంద్రకళ తెలిపారు. చేవెళ్లలోని ఆర్డీవో కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజావాణికి మండల పరిధిలోని కందవాడలో ధరణికి సంబంధించి ఒక ఫిర్యాదు అందిందని తెలిపారు. ఈ ఫిర్యాదును సంబంధిత అధికారులకు పంపి పరిష్కరించేలా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రాజశేఖర్, జూనియర్ అసిస్టెంట్ రాజేందర్, ఆపరేటర్ సర్దార్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులందరూ మే డేను విజయవంతం చేయాలి



చేవెళ్ల రూరల్ : శంకర్‌పల్లిలో మే డే పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్

చేవెళ్ల రూరల్, ఏప్రిల్ 28 : కార్మికులందరూ మే డేను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ పిలుపునిచ్చారు. సోమవారం శంకర్‌పల్లిలో తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రపంచ కార్మిక దినోత్సవం మే డే పోస్టర్‌ను అల్లి దేవేందర్ ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల హక్కుల సాధనకు కలిసి కట్టుగా ఉద్యమించే దిశగా పయనించాలన్నారు. కార్యక్రమంలో శంకర్‌పల్లి మున్సిపల్ యూనియన్ అధ్యక్షుడు బిసొల్ల రమేశ్, ఉపాధ్యక్షులు సత్యం, మోహన్, కోశాధికారి రాములు, నాయకులు బుచ్చయ్య, రవి, నర్సింహులు, రామచందర్, మానయ్య, శ్రీకాంత్, కన్నా, కిష్టయ్య, అజీమ్, పాషా పాల్గొన్నారు.

**ఎలిమినేడులో..**

**ఇబ్రహీంపట్నం :** మేడే ఉత్సవాలను జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ బుగ్గరాములు, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు విజయమ్మ అన్నారు. మండల పరిధిలోని ఎలిమినేడులో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులతో కలిసి మేడే వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక చట్టాలను కాలరాయాలని చూస్తున్నదని ఆయన ఆరోపించారు. కార్మికులకు ప్రమాదకరమైన లేబర్ కోడ్‌ల రద్దుతో పాటు వారి సమస్యలను పరిష్కరించాలని మే 20న జరగబోయే దేశ వ్యాప్త సమ్మెలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని తెలిపారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులతో పాటు కార్మికులు పోచయ్య, స్వామి, దేవయ్య, నర్సింహ, మల్లమ్మ, ఆండాలు, బుచ్చమ్మ, శారదమ్మ, కళమ్మ, రాములమ్మ, జంగమ్మ, సుగుణమ్మ, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, కృష్ణారెడ్డి తదితరులు

పెద్దఅంబర్‌పేట, ఏప్రిల్ 28: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ వైస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య కోరారు. మున్సిపాలిటీ పరిధి గౌరెల్లిలో డిస్ట్రిక్ట్ కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో హయత్‌నగర్ పీఏసీఎస్ చైర్మన్ చామ కృష్ణారెడ్డి, మండల వ్యవసాయాధికారి బాలరాజు, ప్రజాప్రతినిధులు రమేశ్, భగవాన్‌దాస్, ఆంజనేయులు, వెంకటేశ్, బల్వంత్‌రెడ్డి, అశోక్, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

**తొర్రూర్‌లో..**

**తుర్కయాంజాల్ :** మున్సిపాలిటీ పరిధిలోని తొర్రూర్‌లో రంగారెడ్డి జిల్లా సహకారం మార్కెటింగ్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్యతో కలిసి ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

## రజతోత్సవ సభ చరిత్రలో నిలిచిపోతుంది



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ కడ్తాల్ మండలాధ్యక్షుడు కంబాల పరమేశ్

కడ్తాల్, ఏప్రిల్ 28 : వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నేతృత్వంలో నిర్వహించిన రజతోత్సవ సభ తెలంగాణ చరిత్రలో నిలిచిపోతుందని పార్టీ కడ్తాల్ మండలాధ్యక్షుడు కంబాల పరమేశ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన బీఆర్ఎస్ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. రజతోత్సవ సభకు ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చారని పేర్కొన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రసంగాన్ని ప్రజలు ఆసక్తిగా విన్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ సభ విజయవంతం కావడంతో ప్రతిపక్షాలు నానా హైరానా పడుతున్నాయని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభంజనంలో కాంగ్రెస్ పార్టీ కొట్టుకుపోవడం ఖాయమన్నారు. సభను విజయవంతం చేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఎల్కతుర్తి సభకు తలకొండపల్లి మండల పరిధిలోని పడకల్ గ్రామం నుంచి పాదయాత్ర చేసుకుంటూ వెళ్లిన కుమ్మరి మల్లేశ్‌ను ఆయన అభినందించారు. కార్యక్రమంలో వీరయ్య, కృష్ణయ్యయాదవ్, జంగయ్యగౌడ్, భూనాథ్ నాయక్, మహేశ్‌యాదవ్, రామకృష్ణ, కోట్యా నాయక్, శ్రీనునాయక్ పాల్గొన్నారు.

**కార్యకర్తల్లో పెరిగిన జోష్**

**షాద్‌నగర్‌రూరల్ :** వరంగల్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ రజతోత్సవం మహాసభ విజయవంతం కావడంతో ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని బీఆర్ఎస్ శ్రేణులు, కార్యకర్తలలో నూతనోత్సాహం నిండింది. గులాబీ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ రజతోత్సవ మహాసభలో ప్రసంగించిన తీరు అందరినీ అకట్టుకున్నదని బీఆర్ఎస్ మండల యువనాయకుడు రెబ్బనమోని చంద్రశేఖర్ తెలిపారు. మనం పుట్టింది తెలంగాణ కోసమని, అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా అందరూ ప్రజల పక్షాన ఉండాలని పిలుపునిచ్చి, తనదైన శైలిలో గులాబీదళంలో మరింత ఉత్తేజాన్ని నింపారన్నారు. పదవులు ముఖ్యం కాదని తెలంగాణ భవిష్యత్ ముఖ్యమని, ప్రజల సంక్షేమం మన లక్ష్యమని, ఇందుకు అందరూ ప్రజల పక్షాన నిలబడి కాంగ్రెస్ సర్కార్‌ను నిలదీయాలన్నారు. కార్యకర్తలకు నేనే ఎల్లప్పుడు అండగా ఉంటానని చెప్పడంతో కార్యకర్తలలో మరింత జోష్ పెరిగిందని తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని బీఆర్ఎస్ కార్యకర్తలు భారీ స్థాయిలో వరంగల్ సభకు అదివారం తరలి వెళ్లారని పేర్కొన్నారు.

## కుంగ్ ఫూతో విద్యార్థులకు ఆత్మస్థైర్యం



కుంగ్ ఫూ శిక్షణ పొందిన విద్యార్థులతో మాస్టర్లు

షాద్‌నగర్‌టౌన్, ఏప్రిల్ 28: కుంగ్ ఫూ, కరాటేతో ఆత్మస్థైర్యం పెంపొందుతుందని న్యూ పవర్ కుంగ్ ఫూ అకాడమీ మాస్టర్ బాల్‌రాజు అన్నారు. అకాడమీ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన విద్యార్థులకు సోమవారం బెల్టులను అందజేశారు. విద్యార్థులు నేర్చుకున్న కుంగ్ ఫూ ప్రదర్శన అందరినీ ఆకట్టుకున్నది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుంగ్ ఫూ నేర్చుకుంటే ఆపద సమయాల్లో తమను తాము కాపాడుకోవడానికి ఈ విద్య ఎంతో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో మాస్టర్ అహ్మద్‌ఖాన్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## గొర్రెల దొంగలపై చర్యలు తీసుకోవాలి



దాడి జరిగిన ప్రాంతాన్ని పరిశీలించిన బీఎస్పీ నాయకులు

తుర్కయాంజాల్, ఏప్రిల్ 28 : మున్సిపాలిటీ పరిధిలోని కొహెడలో గొర్రెల దొంగతనంతో పాటు ఇరువురిపై దాడి చేసిన దుండగులను గుర్తించి చర్యలు తీసుకోవాలని బీఎస్పీ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు పట్నం రమేశ్ డిమాండ్ చేశారు. సోమవారం ఉదయం 3 గంటల ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తులు బొలెరో వాహనంలో వచ్చి గొర్రెల మంద వద్ద నిద్రిస్తున్న రాసూరి నవీన్, రావు శ్రీకాంత్‌పై కత్తులతో దాడి చేసి జీవాలను ఎత్తుకెళ్లారని తెలిపారు. పోలీసులు వెంటనే నిందితులను గుర్తించి శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు రైతులకు అవగాహన సదస్సు

కడ్తాల్, ఏప్రిల్ 28 :మండల కేంద్రంలోని ఎంబీఏ గార్డెన్‌లో మంగళవారం భూభారతి చట్టంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ముంతాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ నారాయణరెడ్డి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హాజరు కానున్నారని తెలిపారు. ఈ సదస్సుకు రైతులు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆమె కోరారు.

**ఉచిత వైద్య శిబిరం**

**కేశంపేట :** మండల పరిధిలోని వేముల్‌నర్వలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ముచ్చింతల్ జిమ్స్ దవాఖాన వర్గాలు సోమవారం తెలిపాయి. గ్రామంలోని మదర్స్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ఉదయం 9.30 గంటలకు వైద్య శిబిరం ప్రారంభమవుతుందని, శిబిరంలో బీపీ, షుగర్, పల్స్ రేటు, జ్వరం, ఒళ్లు నొప్పులు, డెంటల్‌కు సంబంధించి ఉచిత మందులు అందజేస్తామని తెలిపారు. గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాల ప్రజలు పాల్గొని వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## విద్యుత్ సమస్యను పరిష్కరించాలి

తుర్కయాంజాల్, ఏప్రిల్ 28 : మున్సిపాలిటీ పరిధిలోని కమ్మగూడలో ఉన్న ఇందిరమ్మ కాలనీలో తరచూ విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఆ కాలనీ అధ్యక్షుడు శంకర్ తెలిపారు. ఈ మేరకు సోమవానం విద్యుత్ శాఖ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారులు స్పందించి వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు. స్పందించిన అధికారులు చర్యలు తీసుకుంటామని తెలిపారని ఆయన తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఇందిరమ్మ కాలనీవాసులు ఉన్నారు.

## ఊరికెళ్తున్నారా.. సమాచారం ఇవ్వండి

కొందుర్గు, ఏప్రిల్ 28 : వేసవి సెలవుల్లో దూర ప్రాంతాలకు వెళ్లే వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కొందుర్గు ఎస్సై రవీందర్‌నాయక్ అన్నారు. వేసవి సెలవుల్లో జరిగే దొంగతనాలను అరికట్టడానికి సహకరించాలని సూచించారు. అలాగే ఒంటరిగా వెళ్లే మహిళలు బంగారు అభరణాలపై జాగ్రత్తలు తీసుకోవాలని, అపరిచితుల పట్ల మెళకువగా ఉండాలన్నారు. అపద సమయాల్లో 100 నంబర్‌కు డయల్ చేయాలని కోరారు.

## బాధితుడికి ఎల్‌వోసీ చెక్కు అందజేత



బాధితుడికి ఎల్‌వోసీని అందజేస్తున్న మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్, ఏప్రిల్ 28 : మండల కేంద్రానికి చెందిన ఇప్పల అంజయ్య కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి సమస్యను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన రూ.2 లక్షల ఎల్‌వోసీ చెక్కు మంజూరు చేయించారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాధితుడికి శ్రీనివాస్‌రెడ్డి ఎల్‌వోసీని అందజేశారు. కార్యక్రమంలో బీచ్యానాయక్, యాదయ్య, మల్లేశ్‌గౌడ్, యాదగిరిరెడ్డి, రాజేశ్, రాజేందర్‌గౌడ్, భానుకిరణ్, షాబుద్దీన్, శ్రీకాంత్, శ్రీనునాయక్, శేఖర్, నరేశ్, చెన్నయ్య, చంద్రయ్య, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

**రూ.45వేల చెక్కు అందజేత**

**మంచాల :** మండలంలోని చీదేడు గ్రామానికి చెందిన సంగం మహేశ్‌కు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సహకారంతో మంజూరైన రూ. 45వేల సీఎం సహాయనిధి చెక్కును ఆదిబట్ల మున్సిపాలిటీ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు చరణ్, బుస్సు కుమార్, ఓరుగంటి మహేశగౌడ్, హరి పాల్గొన్నారు.

## ఫార్మా భూనిర్వాసితులకు ప్లాట్లు పంపిణీ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న పగడాల యాదయ్య

యాచారం, ఏప్రిల్ 28 : ఫార్మా భూనిర్వాసితులకు ఇవ్వాల్సిన ఇంటి స్థలాలను వెంటనే పంపిణీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం మండల కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పగడాల యాదయ్య మాట్లాడుతూ.. గతంలో ఫార్మాకు భూములిచ్చిన నిర్వాసితులకు ఇంటికో ఉద్యోగం, ఎకరాకు 121గజాల ఇంటి స్థలం ఇస్తామని చెప్పి, నేటికీ వ్వకపోవడం ఎంతవరకు సమంజసమని ఆయన మండిపడ్డారు. ఫార్మా భూములను పోలీసుల బందోబస్తుతో సర్వేచేసి ఫెన్సింగ్ వేయడంలో ఉన్న చొరవ నిర్వాసితులకు ఇవ్వాల్సిన ప్లాట్ల పంపిణీలో ఎందుకు లేదని ఆయన ప్రశ్నించారు. ఫార్మాకు ఇవ్వని 22,250 ఎకరాలకు సంబంధించిన భూములకు టీఎస్‌ఐఐసీ పేరును తొలగించి తిరిగి రైతుల పేర్లను ఆన్‌లైన్‌లో ఎక్కించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ, నాయకులు బ్రహ్మయ్య, పెద్దయ్య, జగన్, జంగయ్య, విప్లవకుమార్, వెంకటయ్య, చందునాయక్, లాజర్ పాల్గొన్నారు.

## బీరప్ప పండుగకు భద్రత కల్పించాలి



శంషాబాద్ డీసీపీ రాజేశ్‌కు వినతపత్రం అందజేస్తున్న బీరప్ప ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎమ్మె సత్యనారాయణ

కొత్తూరు, ఏప్రిల్ 28: బీరప్ప పండుగకు భద్రత కల్పించాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎమ్మె సత్యనారాయణ కోరారు. ఈ మేరకు సోమవారం శంషాబాద్ డీసీపీ రాజేశ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కొత్తూరు మండలం ఎస్‌బీపల్లిలో జరిగే బీరప్ప పండుగకు రావాలని డీసీపీకి ఆహ్వాన పత్రిక అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నూతనంగా బీరప్ప ఆలయం నిర్మించిన సందర్భంగా పండుగ చేస్తున్నామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉందని వివరించారు. ఈ సందర్భంగా డీసీపీ అవసరమైన భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. అలాగే పండుగ జరిగే ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారని వివరించారు. కార్యక్రమంలో ఎమ్మె అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## బీటీ రోడ్డు పనులు చేపట్టాలని గిరిజనుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న గుర్లకుంట తండా గిరిజనులు


కడ్తాల్, ఏప్రిల్ 28 : అసంపూర్తిగా వదిలేసిన బీటీ రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని గుర్లకుంట తండాకు చెందిన గిరిజనులు డిమాండ్ చేశారు. కడ్తాల్-గుర్లకుంట తండా బీటీ రోడ్డు పనులు ప్రారంభించి రెండేండ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు పనులు పూర్తి కాలేదని సోమవారం తండాకు చెందిన గిరిజనులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2023లో బీటీ రోడ్డు పనులు ప్రారంభించారని, సదరు కాంట్రాక్టర్ మట్టి రోడ్డుపై కంకర పరచి బీటీ వేయలేదని తెలిపారు. కంకర తేలడంతో రహదారిపై రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నట్లు వారు వాపోయారు. రెండు, మూడు రోజుల్లో రోడ్డు పనులు ప్రారంభించకపోతే, మండల కేంద్రంలో ఆందోళన కార్యక్రమాన్ని చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో శంకర్ నాయక్, రవి, యువకులు పాల్గొన్నారు.

## అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బదిలీ



జడ్జికి వీడ్కోలు పలుకుతున్న న్యాయవాదులు

షాద్‌నగర్‌రూరల్, ఏప్రిల్ 28 : షాద్‌నగర్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ధీరజ్‌కుమార్ బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ సభ్యులు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసి ఆయన చేసిన సేవలను కొనియాడారు. అలాగే నూతన సివిల్ జడ్జిగా బాధ్యతలు చేపట్టిన స్వాతిరెడ్డికి స్వాగతం పలికారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు వేణుగోపాల్, ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి నర్సింహులు, లైబ్రేరియన్ సెక్రటరీ జయమ్మ, న్యాయవాదులు రహీమ్, శ్రీశైలం, విజయ్ కుమార్, భాస్కర్, శ్రీశైలం, శ్రీనివాస్, రూప్‌సింగ్ పాల్గొన్నారు.



ఆమనగల్లు మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పరిశీలించారు.

-ఆమనగల్లు, ఏప్రిల్ 28


## పాపిరెడ్డిగూడలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమావేశమైన పూర్వ విద్యార్థులు

కేశంపేట, ఏప్రిల్ 28 : మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2008-09లో 10వ తరగతి బ్యాచ్ విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకొని చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. జీవితంలో ఎంత ఉన్నతస్థాయికి ఎదిగినా చదువు చెప్పిన గురువులను, చిన్ననాటి స్నేహితులను మర్చిపోలేమన్నారు. పూర్వ ఉపాధ్యాయులు వెంకటయ్యగౌడ్, రవికుమార్, చంద్రశేఖర్‌ను సత్కరించారు. అనంతరం డీజే నృత్యాలు చేస్తూ ఉత్సాహంగా గడిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రాఘవేందర్, రామకృష్ణ, రవికుమార్, కృష్ణారెడ్డి, అనిల్‌కుమార్, రాజు, హనుమాన్‌సింగ్, సంతోష, శ్రీవాణి, తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతోనే మానసికోల్లాసం



కికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్ యోగేశ్, సీఐ శ్రీనివాస్ గౌడ్

చేవెళ్ల రూరల్, ఏప్రిల్ 28 : క్రీడలతోనే మానసికోల్లాసం కలుగుతుందని శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్ యోగేశ్ అన్నారు. సోమవారం శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని సింగాపూర్ వార్డులో ఎస్‌జీపీ విలేజ్ ప్రీమియర్ లీగ్ (సీజన్1) క్రికెట్ టోర్నమెంట్‌ను మున్సిపల్ కమిషనర్ యోగేశ్, శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. యువకులు మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడల్లో రాణించి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. గెలుపోటములను పక్కన పెట్టి లక్ష్యం దిశగా పరుగులు తీయాలన్నారు. టోర్నమెంట్ నిర్వాహకులు ప్రసాద్ (బిట్టు), హరీశ్ రెడ్డి, మాజీ ఎంపీపీ గోవర్ధన్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ బొడ్డు లావణ్యాశ్రీనివాస్ రెడ్డి, బొడ్డు పాపిరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ సుధాకర్ రెడ్డి, స్థానిక నేతలు శ్రీనివాస్ రెడ్డి, ప్రవీణ్ కుమార్, నందు, శివ కుమార్, రాజు, శ్రీనివాస్, మల్లేశ్, ప్రతాప్, వెంకటేశ్, మోహన్, శ్రీధర్, రవి తదితరులు పాల్గొన్నారు.